క్లుప్తంగా

ఎయిమ్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష



ఏటీఎస్‌ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో బచ్‌పన్ స్కూల్ డైరెక్టర్ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: ఎయిమ్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష (ఏటీఎస్‌ఈ)లో చింతల్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన బచ్‌పన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన 3 నుంచి 6వ తరగతి విద్యార్థులు ఎటీఎస్‌ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచి మొదటి లెవెల్ నుంచి రెండో లెవల్‌కు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎయిమ్స్ ఫౌండర్ గ్రంధి ప్రకాష్ చిన్నారులకు ఎయిమ్స్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ సర్కిల్ ఇన్‌చార్జ్ ఏఎంహెచ్‌ఓగా ప్రశాంతి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ ఇన్‌చార్జ్ ఏఎంహెచ్‌ఓగా ప్రశాంతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న వైద్య ఆరోగ్యాధికారి రామ్‌రెడ్డి రిలీవ్ కావడంతో ఆయన స్థానంలో గాజులరామారం సర్కిల్ ఏఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న ప్రశాంతికి కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు సంబంధించి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది కాలంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఏడుగురు ఏఎంహెచ్‌ఓలు బదిలీ కావడం చర్చనీయాంశమై విషయం తెలిసిందే.

చిన్నపట్టి నుంచే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాలి



కరాటే విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ

దుండిగల్: మార్షల్ ఆర్ట్స్‌లో చిన్నతనం నుంచి శిక్షణ పొందాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీకి చెందిన చిన్నారులు ఇటీవల సూరారంలో జరిగిన జాతీయస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో ప్రతిభ చాటి మెడల్స్ సాధించారు. కరాటే మాస్టర్ రాము ఆధ్వర్యంలో గోల్డ్ మెడల్స్ సాధించిన పవన్‌సాయి, మల్లీశ్వరి, శ్రీలక్ష్మి, సిల్వర్ మెడల్ సాధించిన రామ్‌చరణ్ మంగళవారం ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు.

కొరడా ఝుళిపించిన రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాల కూల్చివేత




సుభాష్‌నగర్: కొన్ని రోజులు తటస్థంగా ఉన్న రెవెన్యూ అధికారులు కబ్జాలపై మరోసారి కొరడా ఝుళిపించారు. గాజులరామారంలోని సర్వే నం.342లో పినాకిని వద్ద ఒక షెడ్డు, 12 బేస్‌మెంట్లు, మంజుర్‌నగర్‌లో ఒక గది, 7 బేస్‌మెంట్లను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో మంగళవారం జేసీబీతో నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని అధికారులు హెచ్చరించారు.

వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు చోరీ

నిజాంపేట్: వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును స్నాచింగ్ చేసిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ శ్రీనివాసకాలనీలోని సిరిబాలాజీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో ఉండే సర్దలత (62) మంగళవారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న సాయిబాబా ఆలయానికి హారతికి వెళ్లి తదనంతరం నడుచుకుంటూ ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ ఆమెను వెంబడించాడు. వృద్ధురాలు అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ ఎక్కగానే ఆగంతుడు లిఫ్ట్ తలుపు తెరిచి ఆమె మెడలోని 2.5 తులాల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీపీ అధ్యక్షుడు కాసానికి మాతృవియోగం



కౌసల్య (ఫైల్)

నిజాంపేట్: టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తల్లి, బాచుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కాసాని కౌసల్య మంగళవారం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. 2007 నుంచి 2012 వరకు కౌసల్య సర్పంచ్‌గా పని చేశారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ హోలిస్టిక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఆమె పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బస్టాండ్ ఏర్పాటేది.?

● కలగానే జగద్గిరిగుట్ట బస్టాండ్ ఏర్పాటు
● ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరిచిన ప్రజాప్రతినిధులు



జగద్గిరిగుట్ట: ప్రస్తుతం సుమారు 1000 గజాలలో ఉండే బస్టాండ్‌కు తెలంగాణలోని పలు జిల్లాల డిపోల నుంచి ప్రతిరోజు జగద్గిరిగుట్టకు 32 బస్ సర్వీసులు నడుపుతున్నారు. ఇక ఇదే బస్టాండ్‌లో సిటీ బస్సులు, పలు వ్యాపార సంస్థల, హమాలీ అడ్డాలు ఉండటం ఎప్పుడు రద్దీగా ఉంటోంది. బస్టాండ్ విషయమై గడిచిన రెండు దఫా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నేతలుమరచిపోయారు. ఈబస్టాండ్ విషయమై పలు సంఘాలు ధర్నాలకు దిగినా లాభం లేకపోయింది.

నైట్‌హాల్ట్ సిబ్బందికి ఇబ్బందులు..

జిల్లాల నుంచి వచ్చే 28 నైట్‌హాల్ట్ బస్సుల సిబ్బందికి కనీస సౌకర్యాలు లేక రాత్రంతా ఇటు దోమలతో, దొంగల భయంతో జాగారం చేస్తున్నారు. ఈ బస్టాండ్ నిర్మాణం హెచ్‌ఎంటీ ఖాళీస్థలంలో చేపడతామని పలు సార్లు హామీలు గుప్పించినా ఇంతవరకు అమలు కాలేదు. ఆరేళ్లుగా బస్టాండ్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, పలు సంఘాల నాయకులు రిలే నిరాహార దీక్షలతో తీవ్ర ఒత్తిడి పెంచినా, స్థానిక కార్పొరేటర్‌జగన్ సైతం గతేడాదిజూన్21వ తేదీన రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం ఇచ్చినా ఫలితం మాత్రం శూన్యం.

ఆదాయం తప్ప బాధలు చూడటం లేదు..

◆ తెలంగాణలోనిపలు ప్రాంతాల నుంచి వలస వచ్చి స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. రోజు రోజుకి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా బస్సు సర్వీసులు పెంచిన ఆర్టీసీ సంస్థ ఆదాయం చూసూకుంటుందే తప్ప బస్టాండ్ లేక సిబ్బంది పడుతున్న బాధలనుచూడటం లేదు. వచ్చే ఎన్నికలలోపు ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తారోలేదో వేచి చూడాలి.

బస్తీ దవాఖానా ఏది.?

నుస్తి చేస్తే కుస్తీయే..



శ్రీనివాసనగర్‌లోని బస్తీ దవాఖానా భవనం

జగద్గిరిగుట్ట: ప్రజా ఆరోగ్యంపై జీహెచ్‌ఎంసీలోమొత్తం 325 బస్తీ దావాఖానాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. దీనిలో భాగంగానే ఇప్పటివరకు 265బస్తీ దవాఖానాలు పూర్తిచేసి ప్రారంభించారు. త్వరలోనే మరి కొన్ని జీహెచ్‌ఎంసీ పరిధిలో బస్తీ దావాఖానాలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.కాగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుమారు అన్ని డివిజన్‌లలో రెండేసి చొప్పున ఉన్నాయి.మూడేళ్ల క్రితం జగద్గిరిగుట్ట డివిజన్‌కు రెండు బస్తీ దావాఖానాలు ఏర్పాటు చేస్తారని అధికారులు చెప్పారు. గతేడాదిజనవరిలో ప్రారంభమై అరకొర వసతులతో డిసెంబర్‌లో శ్రీనివాస్‌నగర్‌లో ప్రారంభించారు. డివిజన్ పరిధిలో అధిక శాతం పేద, మధ్యతరగతి వారు ఎక్కువ ఉండడంతోఈ ఒక్కబస్తీ దవాఖానాసరిపోతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరో బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రజాధనం వృథా..

నిరుపయోగంగా మోడల్ మార్కెట్



రాజీవ్‌గృహకల్ప సమీపంలోని మోడల్ మార్కెట్

జగద్గిరిగుట్ట: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉంది జగద్గిరిగుట్ట, రాజీవ్‌గృహకల్ప సమీపంలోని మోడల్ మార్కెట్ భవనం పరిస్థితి. 2020 సంవత్సరంలో రూ.65లక్షలతో 13 షటర్లతో ప్రారంభించారు.2020 ఆగస్టులో, 2021 జనవరిలో, 2021 జూన్‌లో ఇలా పలు మార్లు టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న వారు సౌకర్యాల, అద్దె విషయంలో అనాసక్తి చూపడంతో తిరిగి క్రితం సంవత్సనం జనవరి 2022 న ఓపెన్ యాక్షన్ పిలిచారు. అద్దె తగ్గించాలని టెండర్లలో పాల్గొన్న వారు ఏకమవడంతో చేసేదేమీ లేక అధికారులు వెనుదిరిగారు. అద్దెను తగ్గించే విషయమై జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉన్న ఎస్టేట్ ఆఫీస్‌కు ప్రతిపాదనలు పంపిన అధికారులకు అక్కడి నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. చివరకు ఈ మోడల్ మార్కెట్ పార్కింగ్‌కు, అసాంఘీక కార్యాకలాపాలకు అడ్డాగామారింది. ఇలా లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన ఈ మోడల్ మార్కెట్‌ను ముందు ముందు ఎలా ఉపయోగించేకుంటారో వేచిచూడల్సిందే.

సింగరేణి ఉద్యోగికి అరుదైన శస్త్ర చికిత్స

వివరాలు వెల్లడించిన ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రి వైద్యులు

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రిలో కడుపు నొప్పితో బాధపడుతున్న సింగరేణి ఉద్యోగికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసి అతని ప్రాణాలు కాపాడారు. సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తి (54) కడుపు నొప్పితో బాధపడుతూ బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అయితే అతని సమస్య తగ్గకపోగా మరింత ఎక్కువ కావడంతో సదరు ఆస్పత్రి వైద్యులు ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రికి రీఫర్ చేశారు. దీంతో మూడు నెలల క్రితం రోగి ఎస్‌ఎల్‌జీలో జాయిన్ కాగా కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఇంటస్టెనియల్, లాప్రోస్కాపిక్ సర్జన్ డాక్టర్ ఠాగూర్ మోహన్ గ్రంధి అతడికి పరీక్షలు చేశారు. అతడి చిన్న ప్రేగుల్లో రక్తప్రసరణ నిలిచిపోయిందని, మూడో వంతు మృతస్థితికి చేరుకుందని గుర్తించారు.

◆ దీంతో రోగికి వెంటనే శస్త్ర చికిత్స నిర్వహించి 4 మీటర్ల మేర చిన్న ప్రేగుల్లో రెండున్నర మీటర్లు తొలగించారు. దీంతో తాత్కాలిక స్టోమా ప్రక్రియ ద్వారా మల ద్వారానని బయటకు తీసుకురావడంతో అతనికి విటమిన్‌లు, ప్రోటీన్‌లు, లవణాలు అందకపోవడంతో తలెత్తిన సమస్యలను ఆయా విభాగాల వైద్యులు చికిత్సలు అందించి పూర్తిగా నయం చేశారు. మంగళవారం రోగి ఫాలోఅప్ కోసం ఆస్పత్రికి రాగా అతడిని పరీక్షించిన వైద్యులు పూర్తిగా కోలుకున్నట్లు నిర్ధారించారు.

◆ ఈ సందర్భంగా లాప్రోస్కాపిక్ సర్జన్ డాక్టర్ ఠాగూర్ మోహన్ మాట్లాడుతూ... రోగికి శస్త్ర చికిత్స చేసే క్రమంలో మధ్యలో ఆక్సిజన్ శాచ్యురేషన్ తగ్గిపోవడంతో రెండుసార్లు వెంటిలేటర్ మీద పెట్టాల్సి వచ్చిందన్నారు. మొత్తం మూడు వారాల పాటు వైద్యుల పర్యవేక్షణలో రోగిని ఉంచామని తెలిపారు. ఫాలో అప్ కోసం వచ్చిన రోగి మలద్వారాన్ని శరీరం లోపల అమర్చి తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చామన్నారు. ఇప్పుడు అతని ఆరోగ్య పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుందన్నారు. మునుపటిలా తన దిన చర్య చేసుకోగలుగుతున్నాడని పేర్కొన్నారు.

చురుగ్గా జంక్షన్ల విస్తరణ పనులు



ఐడీపీఎల్ చౌరస్తా పనులను పర్యవేక్షిస్తున్న జోనల్ కమిషనర్ మమత

రంగారెడ్డినగర్: జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. మంగళవారం ఐడీపీఎల్, అయోధ్యనగర్ కృష్ణకుంజ్ వద్ద జరుగుతున్న జంక్షన్ల విస్తరణ పనులను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పనులు పూర్తయితే ట్రాఫిక్ జామ్‌లకు చెక్ పడుతుందన్నారు. జెడ్సీ వెంట ఎస్‌ఈ చిన్నారెడ్డి, డీఈ శిరీష, ఏఈ సంపత్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ డీవీ శ్రీనివాస్‌రావు



కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నియంత్రణ విషయంలో ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతామని నూతనంగా ఏర్పడ్డ మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన డీవీ శ్రీనివాసరావు అన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్పీగా ఉన్న ఆయన బదిలీపై మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఒకవైపు జాతీయ రహదారి, మరోవైపు రాష్ట్ర రహదారి, ఇంకోవైపు రాజీవ్ రహదారితో పాటు నగర రహదారులు ఉండడం మూలంగా ఎక్కడికక్కడే జంక్షన్ల ఆధునీకరణ పనులు చేపడుతున్నారని.. త్వరితగతిన వాటిని పూర్తి చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు.

◆ అల్వాల్, మేడ్చల్, బాలానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు మేడ్చల్ డీసీపీ పరిధిలోకి వస్తాయి. ఇటీవల పరిపాలన సౌలభ్యం కోసం మేడ్చల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ఏర్పాటు చేయగా, తాజాగా మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ సైతం ఏర్పాటు చేసి పేట్‌బషీరాబాద్ సమీపంలో ఉన్న స్థలంలో కొత్తగా రెండు డీసీపీ కార్యాలయాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ట్రాఫిక్ డీసీపీ కార్యాలయ పనులు తుది దశకు చేరుకోవడంతో మంగళవారం బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి విధులు నిర్వర్తించారు.

జీఓ.59 నోటీసులు అందుకున్న వారు డబ్బులు చెల్లించాలి

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవ్‌రావు



సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు జీఓ.59 కింద డిమాండ్ నోటీసులు అందిన గృహ యజమానులు మార్చి 31లోగా మూడు వాయిదాలలో డబ్బులు చెల్లించాలని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు అన్నారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ మండల పరిధిలో జీఓ.59 కింద 14,518 దరఖాస్తులు వచ్చాయన్నారు. సెప్టెంబర్ 2002 లో 24 బృందాలతో సర్వే నిర్వహించామని తెలిపారు. పది రోజుల నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి 80శాతం మేర డిమాండ్ నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

◆ ప్రభుత్వం నిర్ణయించిన రేటును మూడు వాయిదాల పద్ధతిలో మార్చి 31లోగా కట్టాలన్నారు. సర్వర్ డౌన్ కారణంగా అందని మరికొంత మందికి త్వరలో డిమాండ్ నోటీసులు అందిస్తామని పేర్కొన్నారు. కొంతమంది ధరలు తగ్గిస్తారనే భ్రమలో మొదటి వాయిదా కట్టలేదని తెలిపారు. ఒకవేళ అలా కట్టని పక్షంలో వారి దరఖాస్తు తిరస్కరణకు గురవుతుందని పేర్కొన్నారు. మార్చి 31 తరువాత మార్కెట్ వ్యాల్యూ పెరుగుతున్న క్రమంలో ముందుగానే డబ్బులు చెల్లించాలని తెలిపారు. డబ్బులు చెల్లించిన వారికి ఎలాంటి చార్జీలు లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని వెల్లడించారు.

ధైవ చింతనతో మనసుకు ప్రశాంతత



గాలిపోచమ్మ బస్తీలోని రేణుక-ఎల్లమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: దైవ చింతనతో మనసుకు ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధి గాలి పోచమ్మ బస్తీలో శ్రీరేణుక ఎల్లమ్మ-కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ సుంకరి కృష్ణ, కార్పొరేటర్ రావులశేషగిరి తదితరులు హాజరై పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి పెద్దఎత్తున మహిళలు బోనాలు సమర్పించారు. దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్ గ్రామంలోని శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన కల్యాణంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అదే విధంగా సూరారం డివిజన్ శివాలయనగర్‌లోని జగదాంబ ఆలయ 17వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రత్యక్ష సాక్ష్యంగా ఉంటాయి

పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు



విస్టా విల్లాస్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ రామలింగరాజు, సీఐ ప్రశాంత్

కుత్బుల్లాపూర్: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నిఘా పెరగడంతో పాటు దొంగలు చోరీలు చేయడానికి కూడా వెనకడుగు వేస్తారని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు అన్నారు. మంగళవారం దూలపల్లి రోడ్డులోని విస్టా విల్లాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 38 సీసీ కెమెరాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ఏదైనా నేరం జరిగినపుడు సీసీ కెమెరాలు ప్రత్యక్ష సాక్ష్యంగా ఉంటాయన్నారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులకు సులభతరం అవుతుందని పేర్కొన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు, గెటెడ్ కమ్యూనిటీ యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ కోరారు. ఈ కార్యక్రమంలో విస్టా విల్లాస్ అసోసియేషన్ సభ్యులు, ఎస్సై రామ్‌నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో మెరుగైన సదుపాయలు కల్పిస్తాం



సోమయ్యనగర్‌లో మంజీరా పైపులైన్‌ను ప్రారంభిస్తున్న జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: డివిజన్‌లో మెరుగైన సదుపాయలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జగన్ అన్నారు. మంగళవారం సోమయ్యనగర్, జగద్గిరినగర్ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా పూర్తి చేసిన మంజీరా పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... డివిజన్ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా కూన మహాలక్ష్మినగర్‌లో సీసీ రోడ్డును ప్రారభించిన ఆయన శ్రీనివాస్‌నగర్‌లో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోమయ్యనగర్ అధ్యక్షుడు యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకులు విఠల్ ముదిరాజ్, నరసింహారెడ్డి, మనోజ్, ఇంద్రగౌడ్, వరలక్ష్మి, శాంతమ్మ, రాజు, చిన్న, ప్రకాష్, సత్తిరెడ్డి, వాటర్‌వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రిజ్వాన్, ఏఈ తిరుపతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నాం

నిజాంపేట్: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీరేణుక ఎల్లమ్మ కాలనీలో పర్యటించి భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ వ్యాప్తంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నారాయణరావు, కార్పొరేషన్ బీఆర్‌ఎస్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కోడారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ-పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, భక్తులు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ ఎస్సార్‌నాయక్‌నగర్‌లోని శ్రీపెద్దమ్మ పోచమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నానన్నారు. దైవ ఆరాధనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొబ్బ ప్రసాద్, బొబ్బ రంగారావు, గోపాల్‌రెడ్డి, శేషాచారి, మల్లారెడ్డి, బీజేపీ నాయకులు ఎంఎస్ వాసు, డివిజన్ అధ్యక్షుడు కంది శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విక్రమాదిత్యుడి గొప్పతనం చాటేందుకే..

ఏక్ భారత్–శ్రేష్ఠ్ భారత్

● మధ్యప్రదేశ్ విద్యాశాఖ మంత్రి మోహన్‌యాదవ్
● ఈనెల 10 నుంచి సామ్రాట్ విక్రమాదిత్య ఉత్సవాలు



చింతల్: భారతదేశ చరిత్ర పుటల్లో సామ్రాట్ విక్రమాదిత్యుడి గొప్పతనాన్ని, ఘన చరిత్రను చాటేందుకు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని చేపట్టామని మధ్యప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ మంత్రి మోహన్‌యాదవ్ అన్నారు. ఈనెల 10, 11, 12వ తేదీల్లో చింతల్ హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో సామ్రాట్ విక్రమాదిత్య ఉత్సవ్ జరగనున్న నేపథ్యంలో మంగళవారం హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బీజేపీ జాతీయ నాయకుడు, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధ్యప్రదేశ్ మంత్రి మోహన్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణ కమిటీలను మురళీధర్‌రావు ప్రకటించారు.

◆ ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ మంత్రి మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు సామ్రాట్ విక్రమాదిత్య నాటక ప్రదర్శనను నిర్వహిస్తున్నామని అన్నారు. రాజా విక్రమాదిత్య గొప్పతనాన్ని ప్రజలందరికి వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

◆ ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ, జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, నాయకులు ఎస్ మల్లారెడ్డి, మువ్వా సత్యనారాయణ, వడ్డేపల్లి రాజేశ్వర్‌రావ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చి రెడ్డి, జిల్లా నాయకులు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, గుజరాత్ సమాజ్‌లకు చెందిన పెద్దలు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏక్‌భారత్- శ్రేష్ఠ్‌భారత్ కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మధ్యప్రదేశ్ మంత్రి మోహన్‌యాదవ్

ఎన్నికల్లో డబ్బు పంచని ఏకైక పార్టీ సీపీఐ

కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఉమామహేష్



సీపీఐ సభ్యత్వాలను పునరుద్ధరిస్తూ పత్రాలను అందజేస్తున్న ఉమామహేష్

రంగారెడ్డినగర్: కార్మికులకే రాజ్యాధికారం అందించే లక్ష్యంగా ఏర్పడిన పార్టీ సీపీఐ అని కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ సీపీఐ పార్టీ శాఖ కార్యకర్తల సభ్యత్వ పునరుద్ధణ కార్యక్రమం గాంధీనగర్‌లోని ఐఏటీయూసీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమామహేష్ పలువురికి పార్టీ సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు.

◆ ఒక ప్రాంతం, కులం, మతం కోసం కాకుండా కార్మికుల సంక్షేమానికి అవతరించినదే సీపీఐ అని పేర్కొనన్నారు. పేదలకు భూములు, ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని అన్నారు. కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న దేశాల్లో పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. అందుకు క్యూబా, వియాత్నంలే ఉదాహరణ అని అన్నారు.

◆ భారతదేశంలో పోరాటాల ద్వారా లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో డబ్బులు పంచని ఏకైక పార్టీ తమదేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శిగా చాంద్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్రీనివాస్, శాఖ నాయకులు జావేద్, యాదగిరి, వీరమణి, లక్ష్మి, అల్తాఫ్, యాకుబ్, శ్రీపథ్ తదితరులు పాల్గొన్నారు.